సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. శనివారం జిల్లాలో పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. -8లో



కడప అభివృద్ధిలో నవశకం

వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తల రణ నినాదంతో ఐటీ సిటీ బెంగళూరు మార్మోగింది. మారతహళ్లిలోని ఎస్‌జీఆర్ ప్యాలెస్‌లో ఐటీ వింగ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
39.6/27.4

వాతావరణం

జిల్లాలో శనివారం 27.4 – 39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

గండి శాశ్వత నిత్యాన్నదానానికి లక్ష వితరణ



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారి ముకుందా రెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రూ.1,00,500లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రామసముద్రానికి చెందిన పోలి గంగయ్య, కనకమ్మ కుటుంబీకులు విరాళం అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చేర్మెన్ కావలి కృష్ణ తేజ, ఆలయ ప్రధాన ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

నేడు ఇంటాక్ వారసత్వ పర్యటన

కడప కల్చరల్: ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఈనెల 18న నిర్వహించుకుంటున్న నేపథ్యంలో భారత జాతీయ కళా సంస్కృతి, వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ముందస్తుగా జిల్లాలోని ప్రముఖ వారసత్వ ప్రాంతమైన పుష్పగిరి తీర్థ క్షేత్ర పర్యటన నిర్వహించనుందని కన్వీనర్ లయన్ కె.చిన్నప రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎర్రముక్కపల్లెలోని సంస్థ కార్యాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా సంస్థ సభ్యుల కోసం ఇంటాక్ సభ్యులు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి (నాని), మరో సభ్యులు మయూర నవీన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఆకాశవాణి కడప కేంద్రం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు ఆయన వివరించారు.

461 ఫిర్యాదుల పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 465 ఫిర్యాదులు అందగా 461 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేశామని ఆయన వివరించారు. అందులో ప్రింట్ మీడియా ద్వారా 86 ఫిర్యాదులు అందగా 85 ఫిర్యాదులను పరిష్కరించామని, ఒకటి విచారణలో ఉందన్నారు. కంప్లైంట్ మానిటరింగ్ యాప్/సీఈవో ద్వారా 48 ఫిర్యాదులను, డిస్ట్రిక్ట్ కాల్ సెంటర్ ద్వారా 12, ఎన్‌జీఎస్‌పి-1950 ద్వారా 5 , ఎన్‌జీఎస్‌పి (సిటిజన్) యాప్ ద్వారా 242, సోసియల్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా 54, ఆఫ్‌లైన్ ద్వారా 14 , సి-విజిల్ ద్వారా 180 ఫిర్యాదులను పరిష్కరించామని వివరించారు.

- ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.2,70,45,925 ల మేర నగదు, రూ.2,14,87,739 ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేశామని వివరించారు. అలాగే 867 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.

వీరశివతో ఆర్టీసీ చైర్మన్ మంతనాలు



వీరశివారెడ్డితో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రొద్దుటూరు: టీడీపీ మాజీ ఎమ్మెల్యే గండ్లూరు వీరశివారెడ్డితో ఆర్టీసీ చైర్మన్, కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి భేటీ అయ్యారు. శనివారం ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని వీరశివారెడ్డి ఇంటికి వచ్చి చర్చలు జరిపారు. టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. 'మీ లాంటి నాయకులు మా పార్టీకి అవసరం. టీడీపీలో మీ లాంటి సీనియర్లకు సరైన న్యాయం జరగడం లేదు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మందికి కీలకమైన పదవులు ఇచ్చారు. ఈ ఎన్నికల్లో మా పార్టీకి మద్దతు ఇవ్వాలని, మీ సేవలను సద్వినియోగం చేసుకుంటాం'అని మల్లికార్జునరెడ్డి కోరినట్లు సమాచారం. అయితే తన వర్గీయులతో, కార్యకర్తలతో చర్చించిన నిర్ణయం తీసుకుంటానని వీరశివారెడ్డి తెలిపారు. ఈ చర్చల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ గండ్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీరినట్లే!

- ఆగస్టు వరకు తాగునీటికి ఇబ్బందులు లేవు
- తాగునీటికి అధిక ప్రాధాన్యత
- ఆయా ప్రాజెక్టుల నుంచి 2.121 టీఎంసీల కేటాయింపు
- తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు
- ముందే ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- కడప నగర వాసులకు నీటి ఇక్కట్లు లేనట్లే..



మైలవరం నుంచి పెన్నాకు తరలుతున్న నీరు

కడప సిటీ: అసలే వేసవి కాలం....జలం అడుగంటిపోతోంది...భూగర్భ జలాలు పాతాళానికి వెళ్లాయి....ఎన్నికల కోడ్ కూడా వచ్చింది. ప్రభుత్వం తాగునీటి సమస్య అధిగమిస్తుందో, లేదో.. మొన్నటివరకు ప్రజల్లో ఉన్న సందేహాలు ఇవి. వీటన్నింటిని పటాపంచలు చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మునుపటిలాగానే వెనువెంటనే స్పందించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు నడుంబిగించింది. దీంతో కడప నగర ప్రజలతోపాటు మిగతా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో అధికార యంత్రాంగం తాగునీటి ఎద్దడి ఎక్కడా తలెత్తకుండా చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో ప్రాజెక్టుల సీఈ మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో ప్రణాళికలు సిద్ధం చేసి తాగునీటి ఎద్దడిని అరికట్టారు. ప్రస్తుతం తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుని సజావుగా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 2.121 టీఎంసీల నీటిని కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు వరకు తాగునీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. తాగునీటి సమస్య ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించేందుకు సర్కిల్ పరిధిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి వాటి ద్వారా మానిటరింగ్ చేస్తున్నారు. ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీరు ఆధ్వర్యంలో ఇది జరుగుతోంది. కడప నగరానికి తాగునీటి సమస్య ఎదురవుతుందని అందరూ తీవ్ర ఆందోళన చెందుతున్న సమయంలో మైలవరం నుంచి నీటిని పెన్నానదికి వదిలి అక్కడి నుంచి లింగంపల్లి ద్వారా వాటర్ గండికి నీటిని వచ్చేలా చేసి కడప ప్రజలకు మంచినీటిని అందేలా చర్యలు చేపట్టడంతో ప్రజల ఆందోళన తీర్చినట్లయింది.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు

ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టింది. ప్రణాళికలు సిద్ధం చేసి ముందస్తుగానే చర్యలు వేగవంతం చేయడంతో తాగునీటి ఎద్దడి తప్పింది. ఆయా ప్రాజెక్టుల నుంచి సుమారు 2.121 టీఎంసీల నీటిని వదలడం జరిగింది.

కడప నగరానికి ఇబ్బంది లేకుండా తాగునీరు

కడప నగరానికి తాగునీటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గండికోట నుంచి మైలవరం ప్రాజెక్టుకు నీటిని వదిలి, అక్కడి నుంచి పెన్నానదికి నీటిని వదలడంతో వాటర్ గండికి నీళ్లు చేరాయి. ఈ నేపథ్యంలో కడప నగరానికి నీటి సమస్య తీరింది. మైలవరం నుంచి 74 కిలోమీటర్ల మేర పెన్నానదిలో నీరు ప్రవహించి వాటర్ గండికి నీళ్లు చేరాయి. దీంతో కడపలోని రెండు లక్షల మందికి తాగునీటి అవసరాలను తీర్చేందుకు మార్గం సుగమమైంది. అంతేకాకుండా 34 గ్రామాలకు సంబంధించి నీటి సమస్య తొలగింది.

అవసరాలకు పోను 4.781 టీఎంసీల నీరు మిగులు

జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల పరిధిలో మొత్తం నీటి సామర్థ్యం 81.936 టీఎంసీలుగా ఉంది. ఆయా ప్రాజెక్టులు ప్రస్తుతం 21.188 టీఎంసీల నీరు కలిగి ఉన్నాయి. ఇందులో తాగునీటికి 2.121 టీఎంసీలు నీటిని కేటాయించారు. పరిశ్రమలకు 1.260 టీఎంసీలు, హార్టికల్చర్‌కు అత్యవసర పరిస్థితుల్లో 3.450 టీఎంసీలు కేటాయించారు. అలాగే ఆయా నదులకు వదిలేందుకు 0.500 టీఎంసీలు కేటాయించారు. నీటిని వదిలే క్రమంలో 2.030 టీఎంసీల నీరు వృథా అవుతోందని అంచనా వేశారు. ఇవన్నీ పోను ఇంకా 4.781 టీఎంసీల నీరు ప్రాజెక్టుల్లో మిగులుగానే ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే ఆగస్టు వరకు తాగునీటికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. హార్టికల్చర్‌కు అత్యవసర పరిస్థితుల్లో నీటిని వదిలేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నీటి సరఫరా ఇలా..

సబ్బిదరీ రిజర్వాయర్–1: మైదుకూరు, చుట్టుప్రక్కల గ్రామాలు
సబ్బిదరీ రిజర్వాయర్–2: చెన్నముక్కపల్లె కెనాల్‌కు సంబంధించిన గ్రామాలకు
తెలుగుగంగ: ఆర్టీపీపీతోపాటు బద్వేలు, గోపవరంలోని సెంచరీ ప్లై పరిశ్రమకు
గండికోట: తాడిపత్రి, కొండాపురం, ముద్దనూరు
సర్వరాయసాగర్: అరుణ ఆక్వా కల్చర్, రూరల్ డ్రింకింగ్ వాటర్ పరిధిలోని బోర్లకు రీఛార్జి, ఓ సిమెంటు పరిశ్రమకు
వామికొండ: రూరల్ డ్రింకింగ్ వాటర్ పరిధిలోని బోర్లకు రీఛార్జి
చిత్రావతి: కదిరి, పులివెందుల, ధర్మవరం, పుట్టపర్తి, వేంపల్లె, యూసీఐఎల్ పరిశ్రమకు
పైడిపాలెం: డ్రింకింగ్ వాటర్ పరిధిలోని బోర్ల రీఛార్జింగ్‌తోపాటు సింహాద్రిపురం, తొండూరు
వెలిగల్లు: రాయచోటి, లక్కిరెడ్డిపల్లె

- ఇవికాకుండా ఎమెర్జెన్సీ హార్టికల్చర్ కింద అవసరమైనచోట నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఒంటిమిట్ట రామయ్య కల్యాణోత్సవాలు ప్రారంభం



సీతారాముల ఉత్సవ విగ్రహాలకు పసుపుతో అభిషేకం

ఒంటిమిట్ట/తిరుపతి: వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు శనివారం 'హరిద్రా ఘటనం 'తో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది తొలిసారిగా టీటీడీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా మహిళా భక్తులు సుమారు మూడు కిలోల పసుపును పోసి జై శ్రీరామ్ అంటూ స్మరిస్తూ సంప్రదాయబద్ధంగా రోలులో దంచారు. అంతకు ముందు గర్భాలయం లోపల పసుపు కొమ్ములకు, రోకళ్లకు స్వామి పాదాల చెంత ప్రత్యేక పూజలను చేశారు. అర్చకులు శ్రవణ స్వామి మాట్లాడుతూ భగవత్ విజ్ఞాపనతో హరిద్రా ఘటనం కార్యక్రమం ప్రారంభమైందన్నారు. దీంతో శ్రీ సీతా రామ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు నాంది పలికినట్లు అయిందన్నారు. పసుపు దంచే కార్యక్రమంలో వచ్చిన పసుపును ఉత్సవర్లకు కల్యాణం నాడు నిర్వహించే స్నపనం . తలంబ్రాలు తయారీకి ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, ఒంటిమిట్ట ప్రత్యేకాధికారిణి ప్రశాంతి, సూపరింటిండెంట్ హనుమంతయ్య, ఏపీఆర్వో నీలిమ, అర్చకులు మనోజ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పసుపు కొమ్ములను దంచుతున్న అర్చకులు

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ కీలకం

- ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ ఘట్టం అత్యంత కీలకమైంది, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన, అవగాహనతో చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి విజయ రామరాజు తెలిపారు. శనివారం నగరంలోని గాంధీ నగర్ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల విధులకు నియమించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కడప రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మధుసూదన్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎన్నికల అధికారి పీఓలు, ఏపీవోలకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిపేందుకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు డెమో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎం , వీవీప్యాడ్ చూపిస్తూ వాటి నిర్వహణ ఎలా చేపట్టాలనే అంశాలను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు. శిక్షణా కార్యక్రమం తీరును పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణాధికారి, కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్ శిక్షణకు హాజరైన పీఓలు, ఏపీఓల అటెండెన్స్ షీట్లను పరిశీలించారు.

ఫలితం మెరుగు



కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య కళాశాలల్లో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 46 శాతం ఉత్తీర్ణత ఉంటే ఈ ఏడాది 55 శాతానికి పెరిగింది. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి గతేడాది 60 శాతం ఉత్తీర్ణత ఉంటే ఈ ఏడాది 69 శాతానికి పెరిగింది. ఈ ఏడాది ఫలితాల పరంగా 9 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ప్రతి ఏటా ఇంటర్ ఫలితాల పరంగా జిల్లా చిట్టచివర స్థానంలో ఉండేది. అలాంటిది ఈ ఏడాది చిట్టచివరి నుంచి 5 స్థానాల ముందు నిలిచింది. మొత్తంపై రాష్ట్ర స్థాయిలో 22వ స్థానంలో నిలవడం విశేషం.

ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి వివరాలు ఇలా...

మేనేజ్‌మెంట్	సంవత్సరం	ఉత్తీర్ణతశాతం	సంవత్సరం	ఉత్తీర్ణతశాతం
గవర్నమెంట్	2023	29	2024	42
ఎయిడెడ్	2023	10	2024	20
హైస్కూల్‌ప్లస్	2023	4	2024	18
మోడల్	2023	35	2024	58
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	2023	42	2024	66
కేజీబీవీ	2023	26	2024	60
కోఆపరేటివ్	2023	15	2024	33
ప్రైవేటు	2023	53	2024	58

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ....

మేనేజ్‌మెంట్	సంవత్సరం	ఉత్తీర్ణతశాతం	సంవత్సరం	ఉత్తీర్ణతశాతం
గవర్నమెంట్	2023	45	2024	61
ఎయిడెడ్	2023	21	2024	35
హైస్కూల్‌ప్లస్	2023	0	2024	20
మోడల్	2023	44	2024	59
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	2023	60	2024	71
కేజీబీవీ	2023	37	2024	68
కోఆపరేటివ్	2023	43	2024	35
ప్రైవేటు	2023	68	2024	72

వైఎస్సార్‌సీపీదే హవా!

- సర్వేలన్నీ ఆ పార్టీ అభ్యర్థులకు అనుకూలం
- టీడీపీ నేతల ఇన్నర్ టాక్స్‌లో తేల్చి చెప్పిన బీదా రవిచంద్ర
- ప్రొద్దుటూరులో సైతం వెనుకంజలో ఉన్నామని స్పష్టీకరణ
- పుత్తా అభ్యర్థిత్వం ఖరారు చేస్తే ఉపయోగమనే దిశగా అడుగులు
- వాసుతో కలిసి, అధిష్టానాన్ని ఒప్పించేందుకు విజయవాడ పయనం



సాక్షి ప్రతినిధి, కడప: 'ఉమ్మడి కడప జిల్లాలో వైఎస్సార్‌సీపీ హవా నడుస్తోంది. మీరు చేస్తున్న ప్రచారం, కృషి సరిపోదు. సర్వేలన్నీ ఆ పార్టీ అభ్యర్థులకే అనుకూలంగా ఉన్నాయి. ప్రజా మద్దతు కూడగట్టడంలో పురోగతి సాధించండి. ఇలా ఉమ్మడి జిల్లాలో అనుకున్నట్లుగా టీడీపీ పురోగతి సాధించలేదు. కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరుల్లో మాత్రమే పోటీ ఇవ్వగల్గుతున్నామని టీడీపీ నేతల ఇన్నర్ టాక్స్‌లో చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. కమలాపురంలో పుత్తా చైతన్యరెడ్డి కంటే పుత్తా నరసింహారెడ్డి అభ్యర్థిత్వమే బెటర్‌గా సర్వేలు చెబుతోన్నాయని బీదా రవిచంద్ర టీడీపీ నేతలతో చెప్పుకొచ్చినట్లు సమాచారం. అభ్యర్థిత్వం మార్పు వల్ల టీడీపీకి నష్టమేనని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. అదే విషయాన్ని అధిష్టానానికి వివరించి సర్దిచెప్పాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆమేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డితో కలిసి బీదా రవిచంద్ర అధినేత చంద్రబాబును కలిసేందుకు వెళ్లినట్లు తెలుస్తోంది. కమలాపురం అభ్యర్థిగా పుత్తా నరసింహారెడ్డిని ఖరారు చేయాలని వివరించేందుకు వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా, నారా లోకేష్ యువ నాయకత్వానికి పట్టం కట్టాలనే ఆలోచన మేరకు పుత్తా చైతన్యరెడ్డి పేరు ఖరారు చేసినట్లు చెప్పుకొస్తున్నారు. లోకేష్‌ను ఒప్పించడం కష్టమేనని అధినేతకు పరిస్థితి వివరించి సర్దుబాటు చేయాలనే ఆలోచనతో చంద్రబాబును కలిసేందుకు వెళ్లినట్లు సమాచారం. కాగా శనివారం రాత్రి పొద్దుపోయేంత వరకూ కూడా టీడీపీ నేతలకు చంద్రబాబు అపాయింట్‌మెంట్ దొరకలేదని సమాచారం.

అయితే ఎన్నికల్లో గెలవడం కష్ట'మంటూ టీడీపీ జోన్-5 కో-ఆర్డినేటర్ బీదా రవిచంద్ర జిల్లా నేతలతో వాపోయారు. రెండు రోజులు పాటు జిల్లాలోనే తిష్టవేసిన ఆయన టీడీపీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా రివ్యూ చేస్తూ పార్టీ పరిస్థితి వివరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ నేతలంతా చెప్పుకుంటున్నట్లుగా ప్రొద్దుటూరులో మనమేమి ముందంజలో లేమని బీదా రవిచంద్ర తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అక్కడ కూడా వైఎస్సార్‌సీపీనే కాస్త ముందంజలో ఉందని చెప్పుకొచ్చినట్లు సమాచారం. కడపలో అభ్యర్థి మాధవీరెడ్డి గుర్తింపు తెచ్చుకోవడం మినహా గెలుపొందే స్థాయికి చేరుకోలేదని వివరించినట్లు సమాచారం. ఒక్కటంటే ఒక్క స్థానంలో కూడా ధీమాగా మనమే గెలుస్తున్నాం, అని చెప్పుకునే పరిస్థితి లేదని వాపోయినట్లు తెలుస్తోంది. మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌తో ప్రత్యేకంగా సమావేశమై నెలకొన్న లోటుపాట్లు స్వయంగా వివరించినట్లు తెలుస్తోంది. రెండు పర్యాయాలు ఓడిపోయినా కనీస సానుభూతి లేదని చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఈమారు కూడా అదే ధోరణితో ప్రదర్శిస్తున్నారని, ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్న వారిని కూడా కోల్పోతున్నావు, కులంతో నిమిత్తం లేకుండా అందర్నీ కలుపుగోలుగా వెళ్లాలని సూచించినట్లు సమాచారం.

పుత్తా అభ్యర్థిత్వం కోసం పయనం...

షర్మిల నోటికి తాళం వేయండి!

- సంబంధం లేని ఆరోపణలు చేస్తున్నా కట్టడి చేయరా?
- చంద్రబాబే నయమన్పించేలా షర్మిల ఆరోపణలు
- వివేకా హత్య కేసు కోర్టులో ఉంది
- అప్పుడే హంతకుడు అని ఎలా అంటుంది
- జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి కడప: షర్మిల నోటికి ఎన్నికల కమిషన్ తాళాలు వేయాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఇష్టానుసారం ఆరోపణలు చేస్తున్నారని, కోర్టు విచారణలో ఉన్న వివేకా కేసును పట్టుకొని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హంతకుడు అని ఆరోపించడం, వ్యవస్థలు కళ్లుండీ చూడలేని స్థితిలో ఉండటం శ్రేయస్కరం కాదని, ఇకనైనా షర్మిలను కట్టడి చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి కోరారు. శనివారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పడం ద్వారా ప్రజలు నమ్ముతారనే భావనలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఉన్నట్లు ఉన్నారన్నారు. ప్రజలు చాలా విజ్ఞులన్నారు. ప్రజాసేవ చేస్తున్నది ఎవరు? మాటల గారడీతో లబ్ధి పొందాలనేది ఎవరు? అన్న విషయాన్ని గ్రహించలేని స్థితిలో ప్రజలు లేరన్నారు. సంబంధం లేని వ్యవహారాన్ని అంటగడుతూ 'మోకాలికి బోడిగుండు'కు ముడిపెట్టడం జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టార్గెట్‌గా ఆరోపణలపర్వాన్ని అందుకోవడం జరుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ దుస్థితికి కారణం షర్మిలను ప్రోత్సహిస్తోన్న చంద్రబాబేనని తెలిపారు. ఆనాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెనుకబడిన ప్రాంతం ఉన్న ప్రాంతమని భావిస్తూ స్టీల్ ప్లాంట్ నెలకోల్పేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్లాంటు రెడీ అవుతున్న తరుణంలో కోర్టుల్లో కేసులు వేయించి, వ్యవస్థలను మేనేజ్ చేసి ఆపించారన్నారు. వాస్తవాలను గ్రహించాలన్నారు. తొండలు తిరిగాడే ప్రాంతంలో, కప్పలు కూడా గుడ్లు పెట్టని ప్రాంతంలో పరిశ్రమ తీసుకువస్తుంటే సెలయేర్లు, కుందేళ్ల సయ్యాటలు, వన్యప్రాణులు తిరిగాడే నేల ఇలా ఏమేమో చెప్పి వార్తలు రాయించి ఉక్కు ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకుంది కూడా మిమ్మల్ని వెనుకుండి నడిపించే ఏబీఎన్ రాధాకృష్ణ అన్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో రూ.745కోట్లతో ఉక్కు పరిశ్రమకు మౌలిక వసతులు కల్పించారని, ఫోర్ లైన్ రోడ్డు, 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, గండికోట ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాకు పైపులైన్, నీరు నిల్వ చేసుకునే స్టోరేజ్ ట్యాంక్, రైల్వేలైన్ ఇలా అన్ని సౌకర్యాలను కల్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2023 ఫిబ్రవరి, 15న భూమి పూజ చేశారన్నారు. రూ.3300 కోట్లు తొలివిడతలో, రూ.5500 కోట్లు రెండో విడతలో ఖర్చు చేసేందుకు జేఎస్‌డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని, పనులు కొనసాగుతున్నాయన్నారు.

శవాలపై పేలాలు ఏరుకునే రీతిలో కనీస విచక్షణ లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. వివేకా హత్య కేసు కోర్టు పరిధిలో ఉందని, విచారణలో వాస్తవాలు జడ్జి ముందుకు రానున్నాయన్నారు. అప్పటి వరకూ వెయిట్ చేసే ఓపిక కూడా మీకు లేకపోవడం శోచనీయమన్నారు. వైఎస్ అవినాష్‌రెడ్డిని చట్ట సభలకు వెళ్లకుండా అడ్డుకోవడం మీతరం కాదన్నారు. 'పిల్లి శాపాలకు ఉట్టి తెగదు' అన్నట్లు మీలాంటి వారి శాపనార్థాలు గాలికి కొట్టుకపోవడం ఖాయమన్నారు. మీ ఆరాటమేగానీ మీకు ప్రజామద్దతు లేదన్నారు. పెట్టుడు మనుషులు లేకుండా పర్యటిస్తే మీ పరపతి ఏంటో తెలుస్తుందన్నారు. ఇష్టానుసారం మాట్లాడి మర్యాద కోల్పోవద్దని ఆయన హితవు పలికారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

లింగాల : మండలంలోని పార్నపల్లె చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బాలకృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.2.30 లక్షలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. అతను అరటి కాయల వ్యాపారం చేస్తున్నాడని, అయితే నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. బిల్లులను చూపించిన తర్వాత తిరిగి చెల్లిస్తామని వివరించారు.

రూ.19 లక్షలు పట్టివేత



రూ.19 లక్షలు నగదుతో సీఐ, ఎస్ఐలు

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద రూ.19 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు మాట్లాడారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఈ క్రమంలో శనివారం గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన కారును తనిఖీ చేయగా రూ.19 లక్షలు దొరికాయని తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న అయిరెడ్డి నాగలింగేశ్వరరెడ్డి నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు చూపకపోవడంతో సీజ్ చేశామని చెప్పారు. ఈ తనిఖీలో త్రీటౌన్ ఎస్ఐ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కడప అర్బన్ : కడప నగర శివారులోని సింగపూర్ టౌన్ సిటీ సమీపంలో నిజామిల్ (19) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిజామిల్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రంజాన్ రోజున ఎన్టీఆర్ నగర్ నుంచి తన స్నేహితులతో కలిసి నగరవనం వెళ్లాడు. తిరిగి వస్తుండగా అదుపు తప్పడంతో మోటార్‌సైకిల్ కింద పడటంతో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో నిజామిల్ చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీలో జోరుగా చేరికలు



వల్లూరు : ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వల్లూరు మండల వాసులు



వీరపునాయునిపల్లె : ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సాయినాథ్ శర్మ సమక్షంలో పార్టీలో చేరిన వెల్దుర్తి వాసులు



వేంపల్లె : పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారు. ప్రధానంగా టీడీపీ నుంచి భారీగా వస్తున్నారు. తాజాగా శనివారం జిల్లాలో పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

వల్లూరు : మండలంలోని కుమారునిపల్లె, గణేష్‌పురం గ్రామాలకు చెందిన 44 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. కుమారునిపల్లెకు చెందిన శివమణి, మనోజ్, ప్రణయ్, నాగరాజు, ఆకాష్, జశ్వంత్, రవికుమార్, రామాంజనేయులు, చైతన్య తదితరులు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరారు. గణేష్‌పురానికి చెందిన మాబు, రసూల్, ఇమ్రాన్, ఇర్ఫాన్, అంజి, మన్సూర్, చాంద్ బాషా, సురేంద్ర, సాయి, నవీన్ కుమార్ తదితరులు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల సలహాదారు రాజోలు వీరారెడ్డి వైఎస్ఆర్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేతలు గుర్రంపాటి సుబ్బారెడ్డి, అమర్‌నాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, నారాయణరెడ్డి, వెంకట సాయి, గిరిధర్‌రెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె మండలంలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని వెల్దుర్తి గ్రామంలో పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సాయినాథ్ శర్మ అనుచరులైన 30 కుటుంబాలు, అలాగే కరుడు గట్టిన తెలుగుదేశం పార్టీకి చెందిన 20 కుటుంబాలు శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారిలో చిన్నగంగులయ్య, ఎద్దబాబు, రాజ కుల్లాయప్ప, మోహన్, రామాంజనేయులు, కిషోర్, కుల్లాయప్ప, పెద్ద కుల్లాయప్ప, కిషోర్ కుమార్, సహదేవి, రమణ, గంగాధర్, రాజ కుల్లాయప్ప, లంజనమ్మ, వెంకటలక్షుమ్మ, ఓబులమ్మ, నాగలక్షుమ్మ, గంగా భవాణి, గణేష్, కిరణ్, సుదర్శన్‌రెడ్డి, నాగేంద్ర ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సాయినాథ్‌శర్మ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండదండలు ఎప్పటికీ ఉంటాయని, ఎటువంటి అపోహలు వద్దని పేర్కొన్నారు. అనంతరం సాయినాథశర్మ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు విశ్వనాథ్, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు ఇంద్రారెడ్డి, గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గంగాధర్‌రెడ్డి, నక్కా నాగేశ్వర్‌రావు, గడ్డం దానమయ్య రామాంజనేయరెడ్డి, గంగిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి..

వేంపల్లె : మండలంలోని ఎగువ తువ్వపల్లె, అలిరెడ్డిపల్లె గ్రామాల్లో తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 50 కుటుంబాలు చేరాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ కుటుంబాలకు శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మదీనపురం, ఫక్కీర్‌పల్లి గ్రామాలకు చెందిన అబ్దుల్‌రహ్మాన్, దస్తగిరి, ఖాదర్‌బాషా, అల్లాబకాష్, పీరా, ముబారక్, కుమ్మరాంపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించడంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి హత్య

పెద్దముడియం : మండలంలోని దిగువ కల్వటాల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఆవుల ఆదిలక్షుమ్మ(29) అనే మహిళను ఆమె భర్త కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ కల్వటాల గ్రామానికి చెందిన ఆదిలక్షుమ్మను మైలవరం మండలం కల్లుట్ల గ్రామానికి చెందిన ఆమె మేనమామ అయిన సహదేవుడికి ఇచ్చి 15 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. కొన్ని నెలల నుంచి కుటుంబ కలహాలతో సహదేవుడు భార్యను వేధించేవాడు. వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె నెల రోజుల నుంచి భర్తను వదిలేసి తన తల్లి దగ్గర ఉంటోంది. పెద్దమనుషులు పంచాయితీ చేసినా భర్త దగ్గరకు వెళ్లడానికి నిరాకరించింది. దీంతో కాపురానికి భార్య రాలేదని కక్షపెంచుకున్నాడు. శుక్రవా రం సాయంత్రం ఆమె ఉంటున్న ఇంటి దగ్గరికి వెళ్లి గొడవ పడ్డాడు. అర్ధరాత్రి సమయంలో ఆమెను గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

ఊరేగింపులో ఘర్షణ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జె వడ్డిపల్లెలో గ్రామ దేవత ఏకవీరమ్మ ఊరేగింపు సందర్భంగా శనివారం జరిగిన ఘర్షణలో జె వడ్డిపల్లె గ్రామానికి చెందిన దేవర చిన్నయ్యకు గాయాలయ్యాయి. ఏక వీరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువస్తుండగా మార్గంమధ్యలో బాణసంచా కాల్చే విషయంపై వివాదం చెలరేగడంతో రాళ్లతో దాడులు చేసుకున్నారు. దీంతో దేవర చిన్నయ్యకు తీవ్ర గాయమైంది.

బాల్యం ఆటపాటలతో సాగాలి



మాట్లాడుతున్న సినీ హాస్య నటుడు సప్తగిరి

కడప కల్చరల్ : బాల్యమంతా ఆటపాటలతో సాగి మధురమైన స్మృతిగా మలుచుకోవాలని, విద్యతో పాటు మానసిక, శారీరక వికాసానికి ప్రాధాన్యతనివ్వాలని ప్రముఖ సినీ నటుడు సప్తగిరి అన్నారు. కడప నగరం బళ్లారి రోడ్డులోని నజ్‌ముల్ అమీన్ పబ్లిక్ స్కూలులో ఎలిమెంటరీ, హైస్కూలు విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పలుపోటీలలో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సప్తగిరి మాట్లాడుతూ తనకు ఆటలంటే చాలా ఇష్టమని, దీనివల్ల శారీరక దృఢత్వం, దాని ద్వారా మానసిక వికాసం ఉంటాయని, అలాంటపుడే చదువు బాగా వంట బట్టగలదని, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని, అన్ని అంశాలలో చురుగ్గా ఉండవచ్చని తెలిపారు. పిల్లలను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యువ సినీ హీరో ఆసిఫ్‌ఖాన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు, యువత వారితో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా పెద్దదర్గాలో ప్రార్థనలు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో అలంఖాన్‌పల్లి రాణీతోపు సమీపంలో రెండు రోజుల క్రితం వంశీ అనే యువకుడు, తన స్నేహితులతో కలిసి తిరుపతి సురేంద్ర అలియాస్ జాకీపై బీర్ బాటిళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో బాధితుడు తీవ్రగాయాలపాలై ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వీరికి గతంలో మనస్పర్థలున్నాయని పోలీసుల విచారణలో తేలింది. ఈ సంఘటనలో మరి కొంత మంది పాత్రపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో ప్రధాన నిందితుడైన వంశీని అరెస్ట్ చేశారు. ఇంకా బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడప తాలూకా సీఐ తిమ్మయ్య తెలియజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చీకలబైలు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన గవి సిద్దప్ప కుమారుడు కొప్పుల రాజప్ప (29) కర్ణాటకకు చెందిన 12 బీరు బాటిల్స్ అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం విలువ సుమారు రూ.2160 ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

పీలేరు రూరల్ : బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలోని తిమ్మారెడ్డి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. పీలేరు పట్టణం కామాటంపల్లెకు చెందిన శ్రీరాములు(71) తన ఇంటి నుంచి పట్టణంలోని పాతబస్టాండ్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా తిమ్మారెడ్డి క్రాస్ వద్ద ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదంలో దాడి

మదనపల్లె : స్థల వివాదం కారణంగా జరిగిన దాడిలో ఐదుగురు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. అనపగుట్టకు చెందిన వెంకటరమణ భార్య సరోజమ్మ(55)కు కోళ్ల బైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీ రంగనాథ పెట్రోల్ బంక్ వెనక వైపున భూమి ఉంది. అయితే స్థానికంగా ఉన్న వెంకటరమణ ఆచారి బ్రహ్మంగారి గుడి కట్టేందుకు కొంత స్థలం ఇవ్వాలని కోరడంతో, సరోజమ్మ దంపతులు సమ్మతించి కొంత స్థలం ఇచ్చారు. ఈ క్రమంలో వెంకటరమణ ఆచారి పూర్తి స్థాయిలో భూమి తనదేనంటూ ఆక్రమించుకున్నాడు. శుక్రవారం సాయంత్రం భూమి వద్దకు సరోజమ్మతోపాటు కుటుంబ సభ్యులు రమాదేవి (33), చంద్రబాబు (35), అనురాధ (50), నాగేంద్ర (35) కలిసి వెళ్లారు. భూమి ఎలా ఆక్రమించుకుంటా అంటూ వారు వెంకటరమణ ఆచారిని ప్రశ్నించడంతో వివాదం మొదలైంది. దీంతో వెంకటరమణ ఆచారి యశ్వంత్, మరో నలుగురితో కలిసి సరోజమ్మ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దాడిలో సరోజమ్మ తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు రమాదేవి చంద్రబాబు అనురాధ నాగేంద్రలకు గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో వెంకటరమణాచారికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

విజయవంతంగా రోబోటిక్ కీళ్ల మార్పిడి చికిత్స



రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జరీ చేయించుకున్న చెంద్రాయుడుతో డాక్టర్ జహంగీర్‌బాషా

కడప రూరల్ : కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో విజయవంతంగా రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జరీలు నిర్వహిస్తున్నట్లు ఆ ఆసుపత్రి కీళ్ల మార్పిడి, కీ హోల్ సర్జన్ డాక్టర్ జహంగీర్ బాషా తెలిపారు. ఖాజీపేటకు చెందిన 58 ఏళ్ల చెంద్రాయుడుకు విజయవంతంగా రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జరీని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆ ఆసుపత్రిలో చికిత్స వివరాలను ఆయన తెలిపారు. కీళ్ల మార్పిడిలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వెలిస్ జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ వారి రోబో కీళ్ల మార్పిడీ సర్జరీలను జేబీ ఆసుపత్రిలో తన ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పద్ధతిలో కీళ్ల మార్పిడి చేయించుకోవడం వల్ల అతి తక్కువ కోత, రక్తస్రావం ఉంటుందన్నారు. ఈ సర్జరీ అనంతరం పద్మాసనం కూడా వేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానమైన కీళ్ల మార్పిడి దేశంలోనే అతి తక్కువ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ ఆసుపత్రిలో 16 రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా నిర్వాహించామన్నారు. రాయసీమ ప్రజలు తమ ఆసుపత్రిలో లభించే ప్రపంచ స్థాయి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చెంద్రాయుడు మాట్లాడుతూ సర్జరీ అనంతరం చాలా బాగుందని, కింద కూర్చొని పైకి లేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ ఆసుపత్రి వైద్యులు ఉబేదుల్లా, వెంకటేశ్వర్లు, ఓటీ ఇన్‌చార్జి ప్రసాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



కుల్లాయమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మృత్యుంజయకుంటలో నివాసం వుంటున్న దూదేకుల కుల్లాయప్ప భార్య ఉదయగిరి కుల్లాయమ్మ (20) అనే వివాహిత ఇంటిలో ఎవరూ లేని సమయంలో మనస్తాపంతో శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. అనంతపురానికి చెందిన దూదేకుల కుల్లాయప్పకు, కడప నగరంలోని మృత్యుంజయకుంటకు చెందిన ఉదయగిరి వాహిదా కుమార్తె ఉదయగిరి కుల్లాయమ్మతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 11 నెలల కుమారుడు వున్నాడు. వీరు ఇక్కడే నివసిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన రాత్రి తన భార్యతో గొడవపడిన భర్త, తన కుమారుడిని వెంటపెట్టుకుని అనంతపురం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆమె దగ్గరలోని తన తల్లి నివాసం వుంటున్న ఇంటికి వెళ్లింది. రేకుల ఇంటిలో వున్న ఇనుప పైపునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్ తెలియజేశారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన శ్రీరాములు భార్య నాగమణి (23) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బంగారు వాండ్లపల్లికి చెందిన ఉత్తన్న కుమారుడు బి.కిరణ్ కుమార్ (22) వ్యక్తిగత కారణాలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బుటకపల్లెకు చెందిన అక్కులప్ప కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్ద పనులు చేసేందుకు వెళ్లారు. టమాట పంటకు మందు పిచికారి చేసేందుకు సిద్ధం చేసే క్రమంలో పురుగుల నివారణ మందు గ్లాసులో ఉంచాడు. అయితే అక్కులప్ప కుమార్తె జి.దివ్య (14) వేసవి తాపంతో గ్లాసులో నీళ్లు ఉన్నాయనుకొని తాగేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు లోనుకాగా వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

బాకీ డబ్బు చెల్లించలేదని దాడి

ప్రొద్దుటూరు క్రైం : బాకీ డబ్బు చెల్లించకపోవడంతో వెంకటరమణ అనే వ్యక్తిపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని సుందరయ్యకాలనీకి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన చెన్నమ్మ అనే మహిళ వద్ద రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో డబ్బు అడిగేందుకు శనివారం సాయంత్రం చెన్నమ్మతోపాటు ఆమె అల్లుడు హేమంత్, సోదరుడు సురేష్లు వెంకటరమణ ఇంటి వద్దకు వెళ్లారు. తమ వద్ద తీసుకున్న రూ.4 లక్షలు ఇవ్వాలని అడుగగా తన ఆర్థిక పరిస్థితి బాగలేదని, నెలకు రూ.20 వేలు చొప్పున ఇచ్చుకుంటూ అప్పు తీరుస్తానని చెప్పాడు. ఈ క్రమంలో హేమంత్ టేబుల్ ఫ్యాన్ తీసుకొని దాడి చేయడంతో వెంకటరమణకు స్వల్ప గాయమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన ఆరిఫ్ (23), ఆసిఫ్ (22) ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. మార్గంమధ్యలోని బి.కొత్తకోట వద్ద బైక్ వేగాన్ని అదుపు చేయలేక కింద పడ్డారు. ప్రమాదంలో ఆరిఫ్ తీవ్రంగా గాయపడగా ఆసిఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆరిఫ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. నిమ్మనపల్లె మండలం వెంగళవారి పల్లికు చెందిన నరసింహులు(43) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో శనివారం నిమ్మనపల్లెకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా తవళం రోడ్డులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పిటిఎం మండలం కుమ్మరి కుంట పంచాయతీ బొమ్మకపల్లెకు చెందిన భార్యాభర్తలు శంకర, శారదమ్మ (35), ద్విచక్ర వాహనంలో వస్తుండగా మార్గంమధ్యలోని నవాబు కోట వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శారదమ్మ తీవ్రంగా గాయపడింది.

వైఎస్ కుటుంబంలో చీలిక తెచ్చిన చంద్రబాబు

- షర్మిల నోటి వెంట వస్తున్న ప్రతిమాట బాబు స్క్రిప్టు మేరకే
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కె.సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్ కుటుంబంలో చీలిక తెచ్చిన ఘనత ప్రతిపక్షనేత చంద్రబాబుకే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శనివారం కడపలోని వైఎస్సార్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కె.సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను చేరవేసినట్లు చెప్పారు. కడప నియోజకవర్గంలో సంక్షేమ పథకాలకు రూ.2 వేల కోట్లు ప్రజల ఖాతాలకు జమ చేస్తే, కడప నగరాభివృద్ధికి రూ.2400 కోట్లు విడుదల చేసి సర్వాంగ సుందరంగా రహదారులు విస్తరించి, సర్కిళ్లు ఆధునికీకరించామన్నారు. ముఖ్యమంత్రి మన జిల్లా వాసి కాబట్టే ఇంత అభివృద్ధి జరిగిందని, ఇన్ని నిధులు మనకు వచ్చాయని తెలిపారు. అదే టీడీపీ ఐదేళ్ల పాలనలో కడప నగరాభివృద్ధికి చిల్లిగవ్వ కూడా విదల్చలేదని, ఆలంఖాన్‌పల్లె అభివృద్ధికి రూ.2 కోట్లు ఇస్తానని ప్రకటించిన చంద్రబాబు రెండు పైసలు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. నమ్మించి మోసం చేసే చంద్రబాబు ఒకవైపు, నమ్మిన వారి కోసం ఎందాకైనా వెళ్లే వైఎస్ జగన్ మరోవైపు ఉన్నారని, ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఓటు వేయడంలో తప్పు జరిగితే మన భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్చరించారు. మీకు మంచి జరిగి ఉంటేనే తనకు ఓటేయాలని వైఎస్ జగన్ చెబుతున్నారని, 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబుకు ఈ మాట అనే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. అందుకే అన్ని పార్టీలను కలుపుకొని, పరోక్షంగా కాంగ్రెస్‌తో కుమ్మక్కై ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు. వైఎస్ కుటుంబంలో చీలిక తెచ్చిన ఘనత చంద్రబాబుదేనని, షర్మిల నోటి నుంచి వస్తున్న ప్రతి మాట బాబు స్క్రిప్టు మేరకే వస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ 130 సార్లు బటన్ నొక్కారని, ప్రజలు రెండు సార్లు బటన్ నొక్కి వైఎస్ఆర్‌సీపీకి మద్దతు పలకాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని, నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యేగా అంజద్‌బాషాకు, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల ఉత్సాహం చూస్తుంటే వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందనే విశ్వాసం కలుగుతోందన్నారు. అంజద్‌బాషా 70 వేల మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరిముల్లా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ నాయకులు అహ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షఫీ, దాసరి శివప్రసాద్, వేణుగోపాల్ నాయక్, సీహెచ్ వినోద్, డాక్టర్ శివానాయక్, సమరనాథరెడ్డి, మున్నా, పత్తం అంజి, పవర్ అల్తాఫ్, కె.రాజశేఖర్‌రెడ్డి, ఎ.బాలక్రిష్ణారెడ్డి, బాలస్వామిరెడ్డి, లక్ష్మినారాయణ, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, సునీత పాల్గొన్నారు.